జననీ.. సకల శుభకారిణి



హిందూపురంలో ముకాంబికాదేవిగా వాసవీమాత

శ్రీసత్యసాయి జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలను రెండో రోజు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మవరంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.8లక్షల కరెన్సీతో, నేసేపేట పెద్దమ్మను రూ.3 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. - న్యూస్‌టుడే ధర్మవరం, హిందూపురం సాంస్కృతికం



ధర్మవరంలో రూ. 8 లక్షల కరెన్సీ నోట్ల అలంకరణలో కన్యకాపరమేశ్వరి

హంద్రీనీవాకు మహర్దశ

తొలి దశలో విస్తరణ.. మలి విడత సిమెంట్ లైనింగ్

వైకాపా సర్కారు వంచన

కరవు సీమను సస్యశ్యామలం చేస్తామని స్వయంగా అప్పటి సీఎం జగన్ మాయమాటలతో దగా చేశారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తామంటూ 2019, అక్టోబరు 10న అనంతపురం కొత్తూరు జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన 'కంటి వెలుగు' ప్రారంభోత్సవంలో ఆర్భాటంగా ప్రకటించారు. కనీసం పైసా ఇవ్వలేదు.. గంప మట్టి ఎత్తలేదు.

తెదేపా కూటమి ప్రభుత్వ కార్యాచరణ


అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. నీటి సీజన్ దాటగానే పనులు మొదలు పెట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఈనెల 2న ఉన్నతాధికారులకు సమీక్ష నిర్వహించారు. అంచనాలు తయారు చేసి.. వచ్చే వేసవి నాటికి పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు చేపట్టారు.



విస్తరించనున్న తొలి దశ ప్రధాన కాలువ

హంద్రీనీవా ప్రాజెక్టు వివరాలు

అంశం	మొత్తం	ఉమ్మడి అనంత జిల్లా
ఆయకట్టు (ఎకరాలు)	6,02,500	3,45,000
తొలి దశ దూరం (కి.మీ.)	216	73
రెండో దశ.. (కి.మీ.)	349	274
జలాశయాలు	08	04



అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే

ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రాజెక్టుకు మళ్లీ మంచిరోజులు రానున్నాయి. కర్షకుల మోములో చిరునవ్వు చిందేలా తెదేపా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం నుంచి తక్కువ రోజుల్లోనే ఎక్కువ నీటిని పొందేలా ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనులు చేసేందుకు శ్రీకారం చుట్టనుంది. ఈనెల 2న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సారథ్యంలో కీలక సమీక్ష జరిగింది. ప్రస్తుత నీటి సీజన్ దాటగానే నిర్దేశిత పనులు మొదలు పెట్టడానికి దృష్టి సారించాలంటూ మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. అంచనాల తయారీతోపాటు పరిపాలన, సాంకేతిక ఆమోదం.. తదితర ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు మొదలైంది.

10 నుంచి 19 మీటర్లకు..

హంద్రీనీవా ప్రధాన కాలువ ఉమ్మడి కర్నూలు జిల్లా మాల్యాల నుంచి మొదలై... 143 కి.మీ. వద్ద అనంత జిల్లా సరిహద్దుకు చేరుతుంది. 216 కి.మీ. వద్ద జీడిపల్లి జలాశయం వరకు తొలి దశ కాలువ ముగుస్తుంది. మన జిల్లాలో తొలి దశ ప్రధాన కాలువ పొడువు 73 కి.మీ. మొత్తం 3850 క్యూసెక్కుల ప్రవాహం సామర్థ్యం ఉన్నా... ప్రస్తుతం 2200 క్యూసెక్కులే ఎత్తిపోస్తున్నారు. జిల్లా సరిహద్దుకు వచ్చే సరికి కేవలం 1330 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. జీడిపల్లికి వెయ్యి క్యూసెక్కులు దాటడం లేదు. ప్రస్తుతం కాలువ వెడల్పు 10 మీటర్లు.. దీన్ని 19 మీటర్లకు విస్తరించనున్నారు. దీంతో నిర్దేశిత 3850 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగే అవకాశం ఉంటుంది.

రెండో దశలో..


జీడిపల్లి నుంచి రెండో దశ ప్రధాన కాలువ మొదలవుతుంది. 216 కి.మీ. నుంచి 565 కి.మీ. దాకా ఉంది. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో రెండో దశ కాలువ పొడువు 274 కి.మీ. ఉంటుంది. సామర్థ్యం 2550 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా.. 1200 క్యూసెక్కులు వెళ్లడం గగనం అవుతోంది. ఇపుడు 921 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. రెండో దశలో సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. పూర్తయితే నిర్దేశిత 2550 క్యూసెక్కుల ప్రవాహం సులువుగా సాగుతుంది. పుంగనూరు, మడకశిర ఉప కాలువల పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వవచ్చు.

65 రోజులు.. 7.486 టీఎంసీలు

ఈఏడాది ఆగస్టు ఒకటో తేదీన నీటి ఎత్తిపోతకు శ్రీకారం చుట్టారు. 65 రోజుల్లో 7.486 టీఎంసీలే ఎత్తిపోశారు. 6.668 టీఎంసీలే జిల్లా సరిహద్దుకు చేరాయి. రోజూ 3వేల క్యూసెక్కులకు తగ్గకుండా ప్రవాహం కొనసాగి ఉంటే రెట్టింపు స్థాయిలో జలాలు జిల్లాకు చేరేవి. హంద్రీనీవా పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంత, చిత్తూరు, కడప జిల్లాల పరిధిలో 6.02లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఒక్క ఉమ్మడి అనంత జిల్లా పరిధిలోనే 3.45లక్షల ఎకరాలు ఉంది.

స్థలం ఇచ్చినా.. సద్వినియోగం చేసుకోరా?

- పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా తీవ్ర జాప్యం
- వెనక్కి తీసుకునేందుకు అధికారుల కసరత్తు



ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, హిందూపురం

పారిశ్రామికవాడల్లో భూములు తీసుకున్న కొందరు పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఫలితంగా ఏపీఐఐసీ పరిధిలోని భూమి నిరుపయోగంగా మారుతోంది. నిబంధనల మేరకు పారిశ్రామికవాడలు, ఎంఎస్‌ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) పార్కుల్లో ప్లాట్లు పొందితే నిర్ణీత గడువులోపు యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో వారికిచ్చిన భూమి వెనక్కి తీసుకునే అధికారం ఏపీఐఐసీకి ఉంది. భూములు పొందిన వారిలో చాలామందికి రాజకీయ నాయకులతో సంబంధాలు ఉండటంతో అధికారులు సైతం చూసిచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

180 మందికి తాఖీదులు

ఏపీఐఐసీ పరిధిలో 37 పారిశ్రామికవాడలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రాయితీతో రూ.20 లక్షల వరకు భూములు ఇచ్చారు. మిగిలిన వారికి మార్కెట్ ధర మేరకు భూములు కేటాయించారు. వీరిలో కొందరు ఇప్పటివరకు యూనిట్లు ఏర్పాటు చేయలేదు. అలాంటి వారికి ఇచ్చిన భూములు రద్దు చేయాలని అధికారులు గతంలోనే నిర్ణయం తీసుకున్నా.. రాజకీయ జోక్యంతో ఆలస్యమవుతూ వచ్చింది. తెదేపా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయని వారిని గుర్తించి తుది నోటీసులు జారీ చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి అనంత జిల్లాలో 180 మందికి తాఖీదులు జారీ చేశారు. ఎలాంటి స్పందన లేకపోతే భూములు వెనక్కి తీసుకుంటామని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే 19 మందికి ఇచ్చిన భూముల్ని రద్దు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అవకాశం ఇచ్చినా..

ఉమ్మడి జిల్లాలో 2008 నుంచి 2020 వరకు పారిశ్రామికపార్కుల్లో భూములు తీసుకుని యూనిట్లు ఏర్పాటు చేయని వంద మందిని రెండేళ్ల కిందటే గుర్తించారు. వారందరికీ అప్పట్లోనే తుది నోటీసులు జారీ చేశారు. అప్పటి వైకాపా ప్రభుత్వం మళ్లీ వారికే భూములు కేటాయించాలని నిర్ణయించింది. ఈక్రమంలో వందమందికి రెండోసారి అవకాశం కల్పించారు. అందులో 50 మంది మాత్రమే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మిగిలిన 50 మంది నుంచి ఎలాంటి స్పందన లేదు.

వైకాపా హయాంలో నిర్లక్ష్యం

వైకాపా ప్రభుత్వం పారిశ్రామికవాడల అభివృద్ధికి ఐదేళ్లలో కనీస నిధులు ఇవ్వలేదు. దీంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం నీటి వసతి కల్పించడంలోనూ గత ప్రభుత్వం విఫలమైంది.



రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో ఎంఎస్‌ఎంఈ పార్కు

ప్రస్తుతం తెదేపా కూటమి ప్రభుత్వం పరిశ్రమలను తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. లీజు పద్ధతిలో భూమి కేటాయించేలా నిర్ణయం తీసుకుంది. దీనివల్ల యజమానులకు పెద్దమొత్తం వెచ్చించి భూమిని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. తద్వారా పెట్టుబడి ఎక్కువ పెట్టే అవకాశాలు ఉన్నాయి.

ఎప్పటికప్పుడు నోటీసులు ఇస్తున్నాం

- శువనా సోని, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు

పారిశ్రామికవాడల్లో భూములు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయని వారికి ఎప్పటికప్పుడు నోటీసులు ఇస్తున్నాం. 180 ప్లాట్లకు సంబంధించి భూములు వెనక్కి తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వాటిని రద్దు చేసి కొత్తవారికి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం.

జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం : మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత, కలెక్టర్ ఎమ్మెల్యేలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : దేశంలో ఏపీని అగ్రగామిగా నిలపాలని సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో శ్రీసత్యసాయి జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలోని సాయిఆరామంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి 2024-29కి సంబంధించి వివిధ రంగాల్లో సాధించాల్సిన ప్రగతిపై కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా సమగ్రాభివృద్ధికి నివేదికలను అందించాలని మంత్రి ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలో చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరం సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తిని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. పుట్టపర్తి పరిసరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. శ్రీసత్యసాయి 99వ జయంతి వేడుకలను ప్రభుత్వ పరంగా ఘనంగా నిర్వహించాలని కోరారు. టమాటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు. వెనుకబడిన కదిరి నియోజకవర్గంలో వ్యవసాయంపై అధికంగా ప్రజలు జీవనం సాగిస్తున్నారని, అందుకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కదిరి ఎమ్మెల్యే కందికుంటప్రసాద్ కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

30 మండలాల్లో వర్షం



పుట్టపర్తి సమీపంలో పొంగిపొర్లుతున్న సాహెబ్ చెరువు

పుట్టపర్తి, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లో జల కళసంతరించుంకుంది. శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. అత్యధికంగా తలుపుల మండలంలో 55.2, అత్యల్పంగా అమడగూరు మండలంలో 2.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. పరిగి మండలంలో 45.4, తాడిమర్రి 43.4, ఎన్‌పీకుంట 43.0, ముదిగుబ్బ 42.4, రొళ్ల 42.4, హిందూపురం 34.6, కనగానపల్లి 33.2, గుడిబండ 28.0, మడకశిర 26.8, ధర్మవరం 26.4, కదిరి 25.2, బత్తలపల్లి 24.6, రామగిరి 20.8, అగళి 19.2, గాండ్లపెంట 14.2, నల్లమాడ 12.8, రొద్దం 11.2, బుక్కపట్నం 8.0, చెన్నేకొత్తపల్లి 7.4, నల్లచెరువు 7.4, కొత్తచెరువు 6.8, తనకల్లు 6.6 సోమందేపల్లి 6.2, పెనుకొండ 5.8, పుట్టపర్తి 5.6, అమరాపురం 5.2, ఓడీసీ 5.2, లేపాక్షి 4.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా విస్తరణ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. వర్షపు నీరు చేరడంతో చిత్రావతి నది ప్రవహిస్తోంది.

నెల రోజులకే రోడ్డుపాలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు సరఫరా చేసే పాలు చెడిపోవడంతో గుత్తేదారు శుక్రవారం ముదిగుబ్బలోని పాతూరువంకలో పడేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే విజయవజ్ర పాలు ప్యాకింగ్ చేసిన ప్పటి నుంచి 90 రోజుల వరకు ఉపయోగించవచ్చు. ముదిగుబ్బలో అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు సరఫరా చేసే గుత్తేదారు గత నెలలో పాలు సరఫరా చేసి మిగిలినవి గోదాములో ఉంచారు. అయితే ప్యాకింగ్ చేసిన పాలు నెలదాటిన తర్వాత చెడిపోయి దుర్వాసన రావడంతో శుక్రవారం శివారులోని వంకలో పడేశారు. అయితే ప్రభుత్వం చెడిపోయిన పాలను సరఫరా చేసిందా..? గోదాములో ఎక్కువ రోజులు ఉండటంతో చెడిపోయయా.? అన్న విషయం తెలియరాలేదు. దీనిపై బత్తలపల్లి ప్రాజెక్టు సీడీపీఓ సరస్వతిని వివరణ కోరగా... ముదిగుబ్బలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పాల ప్యాకెట్లు సక్రమంగా అందాయని, గుత్తేదారు దగ్గరే పాడైపోవడంతో పడేశారని తెలిపారు.





తారలు తళుక్కు

నగరంలోని టవర్‌క్లాక్ కూడలి వద్ద సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సినీతారలు పాయల్ రాజ్‌పుత్, నబా నటేశ్ విచ్చేసి సందడి చేశారు. వీరిని చూసేందుకు అభిమానులు రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. - ఈనాడు, అనంతపురం

శుద్ధజల కేంద్రం ఏర్పాటు

రామగిరి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పెద్ద కొండాపురంలో శుక్రవారం పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించారు. తెదేపా నాయకులు మాట్లాడుతూ.. కొండాపురంలో ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి రావడంతో వెంటనే శుద్ధ జల కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ట్రస్ట్ ద్వారా శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటుచేసి తెదేపా నాయకులు బాలాజీ, పాటిబండ ప్రభాకర్ చేతుల మీదుగా కేంద్రాన్ని ప్రారంభించినట్లు వారు తెలిపారు. మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్, తెదేపా మండల కన్వీనర్ సుధాకర్ పాల్గొన్నారు.


7న ఎంబీఏ, ఎంసీఏ తక్షణ ప్రవేశాలు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల సీట్లకు ఈ నెల 7వ తేదీన తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కిరణ్మయి తెలిపారు. ఐసెట్-2024లో అర్హత సాధించిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు ఏపీజే అబ్దుల్‌కలాం పరిపాలన భవనం వద్దకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ వసతిగృహాలకు మంచి రోజులు



రాయదుర్గం ఎస్సీ బాలుర వసతి గృహంలో పనులు చేస్తున్న కార్మికులు



తక్షణ మరమ్మతులకు రూ.1.33కోట్లు

రాయదుర్గం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు మహర్దశ రానుంది. జిల్లాలో అధ్వాన స్థితికి చేరిన 10 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే పనులు జరుగుతున్నాయి.

రూ.7కోట్లకు ప్రతిపాదనలు

జిల్లాలోని 51 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు, 9 రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రభుత్వం తనిఖీ చేయించింది. మరమ్మతులకు అధికారులు రూ.7కోట్లకు ప్రతిపాదనలు పంపారు. తక్షణ మరమ్మతులకు రూ.2 కోట్లు అవసరం అవుతాయని నివేదించారు. ప్రభుత్వం మొదటి దశలో 10 వసతి గృహాలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాల మరమ్మతుకు రూ.1.33 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో గదుల పైకప్పులు, విద్యుత్తు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర పనులు చేపట్టనున్నారు. రాయదుర్గంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో అధ్వాన స్థితికి చేరిన గదులు, భోజనశాల పైకప్పులు పెచ్చులూడగా మరమ్మతులు చేస్తున్నారు.

పనులు వేగవంతం చేస్తాం

ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులోగా మరమ్మతులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కురుగుంట రెసిడెన్షియల్ పాఠశాల పనులు చేపట్టాల్సి ఉంది. ప్రాధాన్యం పరంగా మరమ్మతులు చేయిస్తాం.

- దామోదర్‌రెడ్డి, ఎస్సీ సహాయ సాంఘిక సంక్షేమాధికారి, అనంతపురం

కింద పడకుండా.. నష్టం రాకుండా

పుట్లూరు మండలంలో అరటిసాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. అరటి చెట్టుకు వేసిన గెల క్రమేణా పరిమాణం, బరువు పెరిగి నేలకొరిగినా, కిందపడినా ఎక్కువగా నష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. ఆ కారణంతో ఓ రైతు అరటిగెల బరువుకు వాలకుండా చెట్టు విరగకుండా పొడవైన కర్రలు దన్నుగా పెట్టి కాపాడుకుంటున్నాడు. కొంతమంది మొక్క చుట్టూ ఇనుప వైరు చుట్టి వాలకుండా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల అరటి గెల భారం పూర్తిగా చెట్టుపై పడదు. దీంతో చెట్టు ఒరగదు. పుట్లూరు మండలం కలువపల్లి, సంజీవపురం గ్రామాల అరటి తోటల్లో ఈ ఏర్పాట్లు కనిపిస్తాయి. - ఈనాడు, అనంతపురం



పుట్లూరు మండలం కలువపల్లిలో అరటి చెట్లు పడిపోకుండా అడ్డం పెట్టిన కర్రలు

17 నుంచి ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు


క్రీడా పోటీల నిర్వహణపై చర్చిస్తున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు ఈ నెల 17న డిసెంబరు 13 వ తేదీ వరకూ నిర్వహించాలని నిర్ణయించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు సమావేశంలో శుక్రవారం ఉపకులపతి ఛాంబర్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అచార్య అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇన్‌ఛార్జి వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహణకు తగిన సహకారం అందిస్తామన్నారు. 17 నుంచి 19 వరకూ ఎస్ఎస్‌బీఎన్ కళాశాల మైదానంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, జుడో, బాస్కెట్ బాల్, ఫెన్సింగ్, తైక్వాండో నిర్వహించాలని నిర్ణయించారు. 26 నుంచి 28 వరకూ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాలీబాల్, చదరంగం, బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నిస్, నవంబరు 3 నుంచి 5 వరకూ గుంతకల్లులోని ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో మహిళలకు బ్యాడ్మింటన్ బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, క్రికెట్ టేబుల్ టెన్నిస్ 8 నుంచి 10 వరకూ పురుషులకు గ్రూప్-సి జట్లకు క్రీడాపోటీలు నిర్వహిస్తారు. డిసెంబరు 2 నుంచి 9 వరకూ అనంతపురం ఎస్వీ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పోటీలు 11 నుంచి 13 వరకూ ఆర్ట్స్ కళాశాలలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. స్పోర్ట్ బోర్డు కార్యదర్శి జెస్సీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.











నలిగిన పసిహృదయాలు

● ఇసుక బండి కిందపడి ఒకరు.. తల్లిని చూడటానికెళ్తూ మరొకరు దుర్మరణం

నవ్వులతో మురిపించే చిన్నారులు క్షణాల వ్యవధిలో అనుకోని ప్రమాదం ఎదురై మృత్యుఒడికి చేరి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారు. ఓ తండ్రి తన కుమారుడిని ఇసుక తెచ్చేందుకు బండిపై వెంట తీసుకెళ్లారు. మరో తండ్రి పనికి వెళ్లిన అమ్మను చూడాలని కుమారుడు పట్టుబట్టడంతో ఆటోలో వెంటబెట్టుకొని బయల్దేరాడు. ఈ రెండు ఘటనల్లో ఇద్దరు చిన్నారులను మృత్యువు బలిగొంది. ఒక చిన్నారి బండి టైర్ల కింద పడి నలిగిపోగా.. మరొకరు ఆటో నుంచి జారి పడి దుర్మరణం చెందారు. అప్పటి వరకు చలాకీగా గడిపిన బిడ్డలు.. విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ విషాద ఘటనలు కణేకల్లు, హిందూపురంలో శుక్రవారం చోటు చేసుకుంటున్నాయి.

కణేకల్లు: కణేకల్లులో నివాసం ఉంటున్న ఎర్రిస్వామి, శారద దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు జశ్వంత్(6) ఒకటో తరగతి. ఎర్రిస్వామి దున్నపోతుల సాయంతో బండిపై ఇసుకను తెచ్చి విక్రయించేవారు. కుమారుడిని వెంటబెట్టుకొని వేదావతి హగరికి వెళ్లారు. చిన్నారి బండిపై కూర్చొని ఉండగా ఇసుకను లోడ్ చేశారు. దాన్ని సరి చేస్తుండగా బండి ముందుకు కదలడంతో పైన ఉన్న బాలుడు కింద పడ్డాడు. టైర్లు ఛాతీపై నుంచి వెళ్లడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఇంట్లో ఉంటే బతికేవాడు కదా.. ఎంత పని చేశావు దేవుడా అంటూ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమధు తెలిపారు. మాజీ ఉప సర్పంచి ఆనందరాజు, తెదేపా, కురుబ సంఘం నాయకులు బాధితులను పరామర్శించారు.


జశ్వంత్


చిన్నా

హిందూపురం, పరిగి: పరిగి మండలం కోనాపురానికి చెందిన సురేశ్, పావగడకు చెందిన నాగమణి దంపతుల కుమారుడు చిన్నా(5). తండ్రి ఆటో నడిపేవారు. తల్లి లేపాక్షి మండలం పులమతికి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. శుక్రవారం ఉదయం తల్లిని చూడాలని చిన్నా గోల చేశాడు. దీంతో సురేశ్ ఆటోలో కుమారుడిని తీసుకొని వెళ్తుండగా హిందూపురం పట్టణం కొట్నూరు సమీపాన కుక్క అడ్డొచ్చింది. దాన్ని తప్పించేందుకు బ్రేకు వేయగా ఆటోలో ఉన్న బాలుడు జారి కిందపడ్డాడు. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చింత చెట్ల తొలగింపు వివాదాస్పదం

హిందూపురం, హిందూపురం గ్రామీణం: తూముకుంట బస్టాండు ప్రాంతంలోని చింత చెట్లను శుక్రవారం తొలగించడంతో వివాదాస్పదంగా మారింది. ఓ పార్టీకి మద్దతుదారులు ముందుండి ఈ పని కానిచ్చారని చర్చనీయాంశమైంది. ఈ చెట్లు ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్నాయి. సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొంతమంది నాయకులు దగ్గరుండి తొలగించారు. బస్టాండు విస్తరణలో భాగంగా అడ్డంగా ఉన్న కొమ్మలు తొలగించి ఉంటే సరిపోయేదని, దాదాపు 9 పెద్ద చింతచెట్లను వేర్లతో సహా పెకిలించటం భావ్యం కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని ఆర్అండ్‌బీ ఏఈ మోహన్ దృష్టికి తీసుకెళ్లగా చెట్లు తొలగించమని తాము ఎవ్వరికి అనుమతులు ఇవ్వలేదన్నారు.

గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ ఉరవకొండ జట్టు

రెండో స్థానం మడకశిర


ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌తో ఉరవకొండ జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: గత మూడురోజులుగా నిర్వహిస్తున్న కేంద్రస్థాయి ఆర్డీటీ గ్రామీణ అథ్లెటిక్స్ పోటీల్లో ఉరవకొండ ప్రాంత జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకుంది. ఉరవకొండ ప్రాంత క్రీడాకారులు మూడేసి చొప్పున స్వర్ణాలు, రజతాలు, ఒక కాంస్య పతకం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచారు. రెండో స్థానంలో మడకశిర ప్రాంత జట్టు నిలిచింది. మడకశిర జట్టుకు నాలుగు పసిడి, ఒకటి చొప్పున రజతం, కాంస్య పతకాలు దక్కాయి. మూడో స్థానంలో ఆదోని జట్టు ఒకటేసి చొప్పున స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు సాధించింది. మూడురోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఎట్టకేలకు ముగిశాయి. వర్షం కారణంగా ఉదయం ముగియాల్సిన పోటీలు సాయంత్రం వరకు కొనసాగాయి. కార్యక్రమానికి ఆర్డీటీ డైరెక్టర్లు కృష్ణవేణి, ప్రమీల, లక్ష్మణరావు, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణలు హాజరై విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత బహుమతులు ప్రదానం చేశారు.

రానున్న ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్‌బాబు, నారాయణస్వామి తెలిపారు. శని, ఆదివారాల్లో పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతు, కూలీలు, గొర్రెలు, పశువులు కాపరులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వచ్చే ఐదు రోజుల జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 31.6 నుంచి 36.0 డిగ్రీలుగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు 21.0 నుంచి 22.6 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వాయువ్యం దిశగా గాలులు గంటకు 2 కి.మీ.ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 83 శాతం, మధ్యాహ్నం 78 శాతం నమోదయ్యే సూచన ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఆయుర్వేద వైద్యం పేరిట మోసం

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్సై విజయ్‌కుమార్, పోలీసులు

రాప్తాడు, న్యూస్‌టుడే : ఆయుర్వేద వైద్యం పేరుతో బంగారు ఆభరణాలు దొంగతనం చేసే అంతర్ జిల్లా దొంగను అరెస్ట్ చేసి అతని నుంచి 62.7 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొన్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాప్తాడు డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం గౌరిబిందనూరు తాలూకా నగరిగిరి గ్రామానికి చెందిన గంగన్న శివరాజు (32) శరీర నొప్పులకు సంబంధించిన నూనెల వ్యాపారం చేస్తూ ముసలి వాళ్ళను ఎంపిక చేసుకొని దొంగతనాలు చేస్తుండేవాడు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర, అనంతపురం జిల్లా ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్లలో ఇతనిపై కేసులు నమోదయ్యాయి. సెప్టెంబరు 30న అనంతపురం రూరల్ ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శివరామానాయుడుకు ఆయుర్వేద వైద్యం చేస్తానని పక్షవాతం లేకుండా చేస్తానని చెప్పి.. భార్య రామలక్ష్మిని నమ్మించి 52 గ్రాములు బంగారు ఆభరణాలు దొంగలించారు. 28 డిసెంబరు 2023న శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం అక్కంపల్లికి గ్రామానికి చెందిన హనుమక్కతో నిందితుడు ఆర్డీటీ సంస్థ నుంచి వచ్చినట్లుగా పరిచయం చేసుకొని బియ్యం, బ్యాడలు, మంచి నూనె, ఉచితంగా ఇప్పిస్తానని.. ఈ పథకం పేదవాళ్లకు మాత్రమేనంటూ మాయ మాటలు చెప్పాడు. ఫొటో తీసే సమయంలో ఒంటి పైన నగలు పక్కన పెట్టమని చెప్పి ఆమె దృష్టి మరల్చి 12 గ్రాముల బంగారు నగలు దొంగలించారు. ఈ దొంగతనాలపై దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించడంతో డీఎస్పీ సిబ్బంది, ఇటుకలపల్లి పోలీసులు బృందంగా ఏర్పడి గంగన్న శివరాజును అనంతపురం రూరల్ ఉప్పరపల్లి పంచాయతీ పంగల్ రోడ్డులో శుక్రవారం అరెస్ట్ చేశారు.

బాలికపై అత్యాచారం..

● గర్భం దాల్చిన వైనం
● సమీప బంధువే నిందితుడు?

అమడగూరు, న్యూస్‌టుడే : అమడగూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై (12) అదే గ్రామానికి చెందిన సమీప బంధువైన యువకుడు గత కొన్ని నెలలుగా అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. మూడు రోజుల కిందట బాలికకు కడుపు నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం తల్లిదండ్రులు కర్ణాటక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి గర్భం దాల్చినట్లు నిర్ధారించడంతోపాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కర్ణాటక పోలీసులు అమడగూరు పోలీసులు, జిల్లా ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందించారు. ఘటనపై తల్లిదండ్రులు కుమార్తెను ప్రశ్నించగా విషయం వెలుగుచూసింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పుట్టపర్తి దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటనారాయణ బాలిక, తల్లిదండ్రులను విచారణ చేసి వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఆరోగ్య ఉప కేంద్రం గదిని పరిశీలించారు. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



భూ వివాదం.. వృద్ధుడి బలవన్మరణం


షేక్ రఫీక్

పెనుకొండ, న్యూస్‌టుడే: భూ వివాదంతో మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం పెనుకొండలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల వివరాల మేరకు.. పట్టణంలోని కమాన్ వీధికి చెందిన షేక్ రఫీక్(67) ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేశారు. వచ్చిన నగదుతో గోరంట్ల మండలంలోని మందలపల్లి గ్రామంలో 4.5 ఎకరాల భూమి కొన్నారు. అందులో 90 సెంట్లను రెండేళ్ల కిందట కణేకల్లుకు చెందిన ఆసియాకు రూ.10లక్షలు అడ్వాన్సు తీసుకొని విక్రయించారు. భూమి ఆయన పేరున రిజిస్ట్రేషన్ అయ్యేందుకు ఆలస్యమైంది. ఇదే సమయంలో తాను కొన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయించాలని ఆసియా తన సోదరుడు, విశ్రాంత ఎస్సై ఇక్బాల్ ద్వారా ఒత్తిడి తెచ్చారు. అనేకమార్లు స్పందనలో ఫిర్యాదు చేశారు. పలు మార్లు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పంచాయితీలు చేశారు. విశ్రాంత ఎస్సై రివాల్వర్‌తో ఎన్‌కౌంటర్ చేస్తానని తమను బెదిరించాడని బాధితులు ఆరోపించారు. ఇటీవల ఆసియా గోరంట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ శేఖర్ గురువారం రఫీక్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించారని బాధిత కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం ఆమె పెనుకొండ వచ్చి బెదిరించారని, భయాందోళన చెందిన తన తండ్రి మార్కెట్‌యార్డులోకి వెళ్లి ఫైపునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు కన్నీటి పర్యంతమయ్యారు. రఫీక్‌కు భార్య షకీలభాను, హిదాయతులా, రియాఫత్‌ఉల్లా, కుమార్తె సల్మా ఉన్నారు. ముగ్గురికి పెళ్లిళ్లు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కణేకల్లుకు చెందిన ఆసియా, హిందూపురానికి చెందిన విశ్రాంత ఎస్సై ఇక్బాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.వెంకటేశ్వర్లు తెలిపారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గీత కార్మికులు

హిందూపురం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మద్యం దుకాణాల కేటాయింపులో గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించడంపై గీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీఎంకు అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం వారు తహసీల్దార్ వెంకటేశ్, ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్యను కలిసి న్యాయవాది రవి కుమార్ కల్తీకల్లు విక్రయాలు జరుగుతున్నాయని అధికారులకు చేసిన ఫిర్యాదులో వాస్తవాలు లేవని వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణప్ప, గీత కార్మికులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులను కలిసిన డీఎస్పీ


అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ముజీబ్‌పసపలసయ్యద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వై.వెంకటేశ్వర్లు శుక్రవారం స్థానిక కోర్టులో జడ్జిలను, ఇతర శాఖల ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ముజీబ్‌పసపలసయ్యద్‌కు డీఎస్పీ పుష్పగుచ్ఛం అందజేశారు.

పారిశుద్ధ్యం మెరుగుకు సమన్వయంతో కృషి చేయండి

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగు పరిచేందుకు శానిటరీ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్మికులకు పరికరాలు అందజేయాలని, చెత్త తరలింపుకు అదనంగా మూడు ట్రాక్టర్లను తీసుకోవాలని, వాహనాలకు అవసరమైన మరమ్మతులు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ విశ్వనాథ్, డీఈలు బాలసుబ్రహ్మణ్యం, మోహన్, వాణి, ఏఈ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శంకర్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ సమస్య పరిష్కరించాలి

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 80 గ్రామాలలో బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే సమస్యను పరిష్కరించాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి శుక్రవారం అనంతపురంలో బీఎస్‌ఎన్‌ఎల్ ఏజీఎంను కలిసి మాట్లాడారు. ఏజీఎం సానుకూలంగా స్పందించి సత్వరమే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు మనోహర్, మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం

అమరాపురం, న్యూస్‌టుడే: మండలంలోని హేమావతిలో యాత్రికుల కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పూనుకొన్నారు. బస్టాండు పక్కనే రూ.12 లక్షలతో మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించేందుకు స్థలాన్ని చదునుచేసి మార్కింగ్ వేశారు. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఎమ్ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరై భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనునాయక్ తెలిపారు. కార్యక్రమంలో తాలుకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, ఏఈ హరి, స్థానిక నాయకులు రామచంద్ర, ఓంకార్‌స్వామి, సర్పంచి తిప్పేస్వామి, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డును పట్టించుకునేవారేరీ?

ఆదాయం ఉన్నా.. వసతులు శూన్యం


పేరుకుపోయిన చెత్తచెదారం

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు

- 2023-24లో ఆదాయం: రూ.1.15 కోట్లు
- ఈ ఏడాది ఆదాయ లక్ష్యం: రూ.1.30 కోట్లు
- గతేడాది వచ్చిన చింతపండు: 1.15 క్వింటాళ్లు
- గతేడాది వచ్చిన ఎండు మిర్చి: 15 వేల క్వింటాళ్లు
- ఈ ఏడాది ఆరు నెలల్లో వచ్చిన ఆదాయం: రూ.55 లక్షలు


కూలిపోయిన ప్రహరీ

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు చింతపండు అమ్మకాల్లో ఆసియాలోనే అతి పెద్దది. ఇక్కడ ఏటా లక్ష క్వింటాళ్లకు పైగా చింతపండు విక్రయాలు జరుగుతాయి. ఇక ఎండు మిర్చి విక్రయాల్లో గుంటూరు తరువాత స్థానం హిందూపురం మార్కెట్‌దే. ఏటా రూ.100 కోట్ల లావాదేవీలు జరుగుతాయి. వేలాది మంది రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకోడానికి ఇక్కడికి వస్తారు. కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఎలాంటి సదుపాయాలు కల్పించలేదు.

ఇవీ సమస్యలు : మార్కెట్ ప్రహరీ పలు చోట్ల కూలిపోయింది. పశువులు, పందులు లోపలికి వస్తున్నాయి. దొంగలు లోపలికి చొరబడి సరకును ఎత్తుకెళ్తున్నారు. యార్డులో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. కొన్ని చోట్ల నిప్పు పెడుతుండటంతో పొగ కమ్మేస్తుంది. వర్షపు నీరు బయటకు పోవడానికి కాలువలు లేవు. నీరు నిలిచి దుర్వాసన వస్తుంది. మార్కెట్ అధ్యక్షుల కార్యాలయంలో మాత్రం సదుపాయాలు కల్పించారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న రైతులకు కనీస సౌకర్యాలు లేవు. కేవలం ఒక గది కేటాయించి, వదిలేశారు.

కీలక పోస్టులు ఖాళీ

మార్కెట్ నిర్వహణ కోసం ప్రభుత్వం 18 పోస్టులు మంజూరు చేసింది. అందులో 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విక్రయానికి వచ్చిన సరకుల నాణ్యతను చూడాల్సిన గ్రేడర్, లావాదేవీలు పర్యవేక్షించాల్సిన జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు చెప్పిందే వేదంగా మారింది. యార్డు పరిధిలోని సరిహద్దుల్లో పొరుగు సేవల కింద సిబ్బందిని నియమిస్తున్నారు. ఆదాయం వచ్చే పోస్టుల్లో పొరుగు సేవల సిబ్బంది ఉండరాదనే నిబంధనలు ఉన్నా, మార్కెటింగ్ శాఖ పట్టించుకోవడం లేదు.

ప్రతిపాదనలు పంపాం

ప్రహరీ దెబ్బతినడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పునఃనిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ఆమోదం పొందగానే టెండర్లు పిలిచి పనులు చేస్తాం. కాలువల నిర్మాణంపై చర్చిస్తాం. చెత్త కాల్చకుండా, మున్సిపల్ ట్రాక్టర్లకు అందించేలా చూస్తాం.

\- చంద్రమౌళి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: గుడిబండ మండలంలోని ఎస్.రాయాపురం బీసీ కాలనీలో అంధకారం నెలకొంది. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. **- భాగ్యమ్మ**

సమాధానం: మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **- రాధమ్మ, సర్పంచి**

సమస్య: కురుబరపల్లి పాఠశాల సమీపంలోని ట్యాంకు వద్ద అపరిశుభ్రత నెలకొంది. **- హనుమంతరాయప్ప**

సమాధానం: తొలగిస్తాం.

\- న్యూస్‌టుడే, గుడిబండ

సమస్యలు పరిష్కారం: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకుతోడుగా' శీర్షికన ప్రచురించగా బాధ్యులు స్పందించారు. కురుబరపల్లి నుంచి ఎంఎస్ తండా వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు సంబంధిత ఇంజినీర్ ద్వారా ఎంపీడీఓ రామారావు ప్రతిపాదనలు పంపారు. కురుబరపల్లికి బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మోరుబాగల్ ఇందిరమ్మ కాలనీలో పైపులైన్ వేసి సర్పంచి తిప్పేస్వామి సమస్యను పరిష్కరించారు. వజ్రహట్టి వంకపై మోరీని పునర్నిర్మించేందుకు ఎంపీడీఓ ప్రతిపాదనలు పంపారు. మద్దనకుంట పాఠశాలలో పెరిగిన పిచ్చిమొక్కలను హెచ్ఎం పోతిరెడ్డి పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా తొలగించేశారు.


బస్సు సర్వీసు పునరుద్ధరణ

మడకశిర గ్రామీణం: మండలంలోని గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును పునరుద్ధరించారు. దసరా సెలవుల సందర్భంగా ఆర్టీసీ వారు బస్సును నిలుపుదల చేయడంతో 'బస్సు లేక విద్యార్థుల అవస్థలు' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి బస్సును యథావిధిగా నడిపారు. దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఈనాడుకు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారి వైభవం.. చూసిన కనులదే భాగ్యం


గుడ్డంపల్లిలో సప్పలమ్మదేవికి విభూతి అలంకారం


నవధాన్యాల అలంకరణలో పరిగి కాళికామాత


కల్లుమర్రిలో వీరకేతమ్మ


సోమందేపల్లి: ధన లక్ష్మిగా అంబాభవాని


మహాలక్ష్మిగా ఎల్లమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. హిందూపురంలో అమ్మవార్లను నవ ధాన్యాలు, ఎండు ఫలాలతో అలంకరించారు. **- న్యూస్‌టుడే బృందం**


మడకశిరలో కన్యకాపరమేశ్వరి


గోరంట్లలో గాయత్రీదేవిగా వాసవీమాత


చంద్రగిరిలోని శ్రీగిరిమహేశ్వరి శక్తిపీఠంలో..


లేపాక్షిలో గాయత్రీమాత


రొద్దంలో రేణుకాఎల్లమ్మ

గుంతల దారికి మోక్షమెన్నడో?



హిందూపురం పట్టణం నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ కాలనీకి వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. చిన్న వర్షానికే అందులో నీరు చేరి కుంటలను తలపిస్తోంది. కాలనీలో నుంచి మున్సిపాలిటీకి ఏటా రూ.లక్షల్లో ఆస్తి పన్ను వసూలవుతున్నా పాలకులు, అధికారులు రోడ్డును బాగు చేయడం లేదని స్థానికుడు ముస్తఫా ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని వాపోయారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గుంతలను పూడ్చివేస్తామని చెప్పారు. రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, హిందూపురం పట్టణం**

అడ్డదిడ్డంగా ఆటోలు.. రాకపోకలకు ఇబ్బందులు



సోమందేపల్లిలోని ఎన్టీఆర్ ప్రధాన కూడలిలో ఆటోలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దాంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ర.భ.శా అధికారులు నిధుల కొరతతో ఇక్కడ 24 అడుగుల డివైడర్ నిర్మించి, రోడ్డుకు ఇరువైపుల పుట్‌పాత్, మురుగు కాలువలు నిర్మించకుండా వదిలేశారు. దుకాణదారులు ఆక్రమణలకు తెరలేపడంతో నాలుగు వరుసల రహదారి ఇరుకుగా తయారైంది. దానికితోడు ఆటోలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. ఆటో స్టాండు ఏర్పాటు చేసి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను ఎస్సై రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి, తగు చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, సోమందేపల్లి**

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, HINDUPUR

E.P. No. 14/20 O.S. No. 70/09

Between:

S.R.Rama Krishna **..Plaintiff / D.Hr**

and

1 K.C.Rajanna Setty (died by L.Rs.) Lakshmi and others

..Defendants / J.Drs

వేలము ప్రకటన

పై కనిన E.P.లో D.Hr తన బాకీ రాబట్టుకొనుటకు క్రింద కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కనిన కోర్టులో 25-10-2024 తేదీన ఉ॥ 10.30 గంటలకు వేలం జరుగును. వేలంలో పాల్గొనదలచిన వారు కోర్టు వారి షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

SCHEDULE

Property situated in SRD Hindupur, RD of Hindupur now at Sri Satyasai Dist. in Malapuram / Hindupur Municipality with Sy. No. 388-1, 388-2, Plot No. 5 of an area 240 Sq. Yards with in the following **Boundaries: EAST:** Site of same Sy. No., **WEST:** 20 feet Road, **NORTH:** Plots No. 6 & 8, **SOUTH:** Plot No. 4

Amin Value: 70,00,000/-

D.Hr. Value: 30,000/-

Market Value as on: 30,000/-

Further Hearing Date: 01-11-24

By Order of the Hon'ble Court

P.Subramanyam Sastry,
Advocate for the Petitioner /D.Hr. Hindupur

వన్యప్రాణులను కాపాడుకుందాం


మాట్లాడుతున్న అటవీ అధికారి రామకృష్ణ

గోరంట్ల, న్యూస్‌టుడే: వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అటవీశాఖాధికారులు పేర్కొన్నారు. మండలంలోని కమ్మలవాండ్లపల్లి సమీపంలో ఉన్న భారతీయ ఇంజినీరింగ్ సైన్సు అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెక్షన్ అధికారి చంద్రానాయక్, బీట్ అధికారులు రామకృష్ణ, రాహుల్ వన్యప్రాణులను ఎలా కాపాడుకోవాలి, వాటి వల్ల ప్రజలకు కలిగే ఉపయోగాల గురించి వివరించారు. యూనివర్సిటీ డీన్ డాక్టర్‌శర్మ, రిజిస్ట్రార్ జయప్రకాష్ పాల్గొన్నారు.

యువ పారిశ్రామికవేత్తలతోనే దేశం బలోపేతం: భారతదేశం బలోపేతం కావడంలో యువ పారిశ్రామికవేత్తలు కీలకపాత్ర పోషిస్తారని ముంబయికి చెందిన నాబార్డు మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ ఆర్ఎం కుమ్మార్ పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బసవరాజ్ గిరెన్వర్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో పారిశ్రామిక అభివృద్ధిపై విద్యార్థులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు.

నేడు ఉచిత డీఎస్సీ శిక్షణ ప్రారంభం

పెనుకొండ న్యూస్‌టుడే: పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో శనివారం ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారి గంగాధర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

రొద్దం, న్యూస్‌టుడే: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న తెదేపా కార్యకర్త ఆర్ లోచెర్ల గ్రామానికి చెందిన శ్రీరాములకు రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి సవిత రూ.80 వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచి హనుమంతరాయుడు, పలువురు తెదేపా నాయకులు నగదును తీసుకెళ్లి బాధితుడికి అందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

సోమందేపల్లి, న్యూస్‌టుడే: ప్రజలు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై రమేశ్‌బాబు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన మండలంలోని పోలేపల్లిలో గ్రామస్థులకు పలు విషయాల గురించి అవగాహన కలిగించారు. మద్యం, గంజాయి బారిన పడితే ఆరోగ్యాలు దెబ్బతిని, రోగాల పాలవుతారని అన్నారు. జూదాలకు బానిసగా మారితే జీవితాలే నాశనం అవుతాయని ఎస్సై హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తూ తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని ఆయన కోరారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో నరేశ్

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ ఎంపీడీఓగా నరేశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శివశంకరప్ప చెన్నేకొత్తపల్లికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చితమత్తూరు నుంచి నరేశ్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథిలను వేర్వేరుగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కియా పోలీసుస్టేషన్ ఎస్సైగా రాజేశ్



పెనుకొండ పట్టణం: మండలంలోని కియా ఇండస్ట్రీయల్ ఏరియా పోలీస్‌స్టేషన్ ఎస్సైగా రాజేశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై రంగడు ఇటీవల బదిలీపై పరిగి స్టేషన్‌కు వెళ్లారు.

పరిశ్రమలు, వాణిజ్యంతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న రామ్‌ప్రసాద్

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా కల్పించాలంటే పరిశ్రమలు, వ్యాపార రంగాలపై ప్రభుత్వం ఎక్కువ దృష్టి సారించాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని పరిశ్రమలు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బైసాని రామ్‌ప్రసాద్ అన్నారు. స్వర్ణాంధ్ర-2047 జిల్లా విజన్ ప్లాన్ రూపొందించడానికి ప్రభుత్వం శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పట్టణానికి చెందిన రామ్‌ప్రసాద్‌తో పాటు పలువురు వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

గుడిబండ, న్యూస్‌టుడే: రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి వీరనరేశ్ సూచించారు. మండలంలోని జమ్మలబండ, కొంకల్లు రైతు సేవా కేంద్రాల్లో రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు నరసమ్మ, కవిత, రైతు సేవా కేంద్రం అధికారులు నగేశ్, సంధ్య, ఈరన్న పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి


ప్రసంగిస్తున్న సీఐ శేఖర్

గోరంట్ల, న్యూస్‌టుడే: ప్రతివిద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకెళ్లాలని సీఐ శేఖర్ తెలిపారు. స్థానిక ఎస్వీపీఎం డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమానికి కరస్పాండెంట్‌తో పాటు సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ భక్తవత్సలం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఒకరి మృతి

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని పాలసముద్రం కూడలి సమీపంలో శుక్రవారం వడిగేపల్లికి చెందిన ఆదినారాయణ(52) ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం నుంచి జారి పడి మృతిచెందారు. మరొకరితో కలిసి వాహనంలో వెళుతుండగా మూర్ఛ వచ్చినట్లు సమాచారం. చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది ధ్రువీకరించారు.

వాహన చోదకుడిపై కేసు

పరిగి, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రగుంటకు చెందిన శివయ్య ద్విచక్ర వాహనంలో వస్తుండగా కొడికొండ-శిర జాతీయ రహదారిపై శ్రీరంగరాజుపల్లికి చెందిన భానుప్రకాష్ తన ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి భార్య అంజినమ్మ ఫిర్యాదు మేరకు భానుప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై హిదాయతుల్లా తెలిపారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని బిసలమానేపల్లిలో చంద్రశేఖర్ తన ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనానికి గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వాహనం కాలిపోయి రూ.80వేలు వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక ఎవరైనా ఆకతాయిలు నిప్పు పెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.


పిచ్చి మొక్కలు తిని మేకలు మృత్యువాత

రొళ్ల, న్యూస్‌టుడే: రొళ్ల మండలంలోని హునిసేకుంట గ్రామంలో రాజన్న, రవికుమార్, గోవిందప్ప అనే కాపరులకు చెందిన 12 మేకలు పిచ్చి మొక్కలు తిని మృత్యువాత పడ్డాయి. ముగ్గురికి కలిపి 58 మేకలు ఉన్నాయి. వీటి ఆధారంగానే జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం మేత కోసం ముగ్గురు కాపరులు మేకలను తోలుకుని వెళ్లారు. సాయంత్రం రోడ్డుపక్కన ఉన్న పిచ్చి మొక్కలు తిని 12 మేకలు మృతి చెందాయని, రూ.1.5 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

శిథిల భవనాల్లో వైద్య సేవలు

• భయాందోళనలో రోగులు

మండలం : రొద్దం | జనాభా : 55వేలకుపైగా | గ్రామ పంచాయతీలు:19 | రోజూ ఓపీ : 350-400


వర్షం వస్తే వరండాలో రోగులకు చికిత్స

పెనుకొండ, రొద్దం, న్యూస్‌టుడే: రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. అందులో వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. రోగులు భయాందోళన చెందుతున్నారు. 2020-21లో 10 పడకల సామర్థ్యంతో ఆసుపత్రి నూతన భవన నిర్మాణం ప్రారంభించారు. నిధులు సక్రమంగా మంజూరు కాకపోవడంతో పునాదులకే పరిమితమైంది. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో శిథిల భవనం పైకప్పు కారుతోంది. వైద్యులు, సిబ్బంది రోగులకు వరండాలోనే వైద్యసేవలు అందించాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. సిబ్బంది నివాస భవనాలు సైతం శిథిలమయ్యాయి. అందులో ఎవరూ ఉండటంలేదు. రాత్రివేళ అత్యవసర వైద్యం కోసం రోగులు వస్తే ప్రాథమిక చికిత్స అందించి పెనుకొండ, హిందూపురం వైద్యశాలలకు రెఫర్ చేస్తున్నారు.


మూడేళ్లుగా పునాదులకే పరిమితమైన నూతన పీహెచ్‌సీ భవనం

ఉన్నతాధికారులకు నివేదించాం

రొద్దం పీహెచ్‌సీ దుస్థితిపై ఇటీవల ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తాం.

\- మంజువాణి, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

హిందూపురం, రొళ్ల, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి(17) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. కళాశాలకు దసరా సెలవులు ఇవ్వడంతో గురువారం వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులను ఇంటికి పంపారు. విద్యార్థి చదువులో వెనకబడి ఉండటం, మొదటి సంవత్సరంలో ఎక్కువ సబ్జెక్టులు తప్పడంతో మనస్తాపానికి గురై ఇంటికి వెళ్లకుండా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. గుర్తింపు కార్డు ఆధారంగా కళాశాల యాజమాన్యం, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించి తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

కళాకారుల సంక్షేమమే లక్ష్యం

కదిరి, న్యూస్‌టుడే : కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా జానపద కళాకారుల సంఘం పని చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.ఆర్.కృష్ణబాబు పేర్కొన్నారు. శుక్రవారం కదిరిలోని కృష్ణ మందిరంలో కదిరి ప్రాంత కళాకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కళాకారులకు రూ. లక్ష బీమా, గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు, కళాభవనం, ప్రయాణాల్లో రాయితీ వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండు చేశారు. వాటి సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీగణపతి, నాయకులు సరోజమ్మ, గోవర్ధన్, రాజారెడ్డి, సూర్యనారాయణ, లక్ష్మీప్రసన్న, బాలయ్య, శంకర్, రామసుబ్బయ్య, చందూనాయక్, శ్రావణిలు పాల్గొన్నారు.

'బీసీలకు రక్షణ చట్టం తేవాలి'

కదిరి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు మాదిరి బీసీలకు రక్షణ చట్టం కల్పించాలని కోరుతూ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. శుక్రవారం కదిరిలోని ఆయన నివాసంలో వారు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కుల గణన, సామాజిక భవనం ఏర్పాటు, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండు చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ రక్షణ చట్టం ఏర్పాటు, బీసీలకు ప్రత్యేక భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, నారాయణ, శ్రీనివాసులు, రామ్మోహన్, గోపాల్, మునిస్వామి, అనిల్, జయరాజ్, శంకరనారాయణరాజు, రమణలు పాల్గొన్నారు.

స్తంభాన్ని అల్లుకున్న నిర్లక్ష్యం



గాండ్లపెంట మండలంలోని కటారుపల్లి గొల్లపల్లికి సమీపాన ఉన్న వ్యవసాయ విద్యుత్తు నియంత్రిక స్తంభానికి చెట్ల తీగలు అల్లుకున్నాయి. విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో చెట్ల తీగలు అల్లుకోవడంతో గాలివీచినప్పుడల్లా విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం చోటుచేసుకుంటోంది. ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అల్లుకున్న తీగలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గాండ్లపెంట



ధ్వంసమైన ఆర్బీకే తలుపు



సచివాలయానికి ఏర్పాటు చేసిన కడ్డీలు మాయం

ప్రభుత్వ భవనాలకు రక్షణ కరవు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన సచివాలయం, ఆర్బీకే భవనాలకు రక్షణ కరవైంది. కదిరి మండలం కొండమనాయునిపాళ్యం గ్రామంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.35 లక్షల వ్యయంతో సచివాలయం, రూ.21.80 లక్షలతో ఆర్బీకే భవనాలు నిర్మించారు. నిర్వహణ లేకపోవడం, గ్రామానికి దూరంగా ఉండటంతో ఆకతాయిలు ఆర్బీకే తలుపులు పగులగొట్టారు. గదుల్లో విచ్చలవిడిగా మద్యం తాగుతున్నారు. ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. సచివాలయ భవనానికి అమర్చిన కడ్డీలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని ఈవోఆర్డీ అంజనప్ప దృష్టికి తీసుకెళ్లగా తలుపులు ధ్వంసం, కడ్డీల చోరీపై పంచాయతీ కార్యదర్శితో గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

పుట్టపర్తి డీఎస్పీగా విజయ్‌కుమార్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి డీఎస్పీగా బి.విజయ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం వేచి ఉన్న ఆయనను పుట్టపర్తికి బదిలీ చేశారు. మహిళ పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆవల శ్రీనివాసరావును రేపల్లె డివిజన్‌కు బదిలీ చేశారు. రెండు నెలల కిందట జరిగిన బదిలీల్లో ఆవల శ్రీనివాసరావును పుట్టపర్తి మహిళ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన్నే పుట్టపర్తి ఇన్‌చార్జి డీఎస్పీగా కొనసాగించారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు

తాడేపల్లి : గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో మంత్రి నారా లోకేశ్‌కు శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం చెందిన రమణమ్మ ఫిర్యాదు చేశారు. వారసత్వంగా సంక్రమించిన తమ భూమిని నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆమె మంత్రి ఎదుట ఆవేదన చెందారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య : చినగానిపల్లి రైతు సేవా కేంద్రం, ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారిలో చిన్నపాటి కాలువలోకి వర్షం నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- రైతులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు**

సమాధానం : ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. **- గుప్తా, ఏఈ, పీఆర్**

సమస్య : అమడగూరులో ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **- మారుతి, సుధాకర్**

సమాధానం : గుంతలు పూడ్చడానికి చర్యలు చేపడతాం. **- చంద్ర, పంచాయతీ కార్యదర్శి, అమడగూరు** – న్యూస్‌టుడే, అమడగూరు

స్పందనకు వందనం

సమస్య : కొడవండ్లపల్లిలోని ఎస్సీ కాలనీలో చేతి పంపు మరమ్మతుకు గురైంది. దాన్ని బాగు చేయిస్తే నీటి సమస్య తీరుతుంది. **- గ్రామస్థులు**

పరిష్కారం : ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రమోద్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా వెంటనే స్పందించి సిబ్బంది ద్వారా చేతిపంపును బాగుచేయించారు. దీంతో కాలనీ ప్రజలకు తాగునీటి సమస్య తీరింది.

సమస్య : దొరిగల్లు సచివాలయం దగ్గర కదిరికి వెళ్లే మున్సిపల్ పైప్ లైన్ దెబ్బతింది. దీంతో తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. సచివాలయం ముందు రొచ్చుగా మారుతోంది. **- గ్రామస్థులు**

పరిష్కారం : ఈ సమస్యను కదిరి మున్సిపల్ ఏఈ అబ్దుల్ రహీం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీ కాకుండా మరమ్మతులు చేపట్టారు. భవిష్యత్తులో పైప్‌లైన్ లీకేజీ కాకుండా శాశ్వత పరిష్కారం చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, ముదిగుబ్బ

అధ్వాన దారితో అవస్థలు



కదిరి మండలం ముత్యాల చెరువు పంచాయతీ పరిధిలోని యాకాల చెరువు కొత్తపల్లి గ్రామం రహదారి అధ్వానంగా ఉంది. బీటీ రహదారి కంకర తేలి, గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ శాఖ జేఈ తులసీ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలో చేనేత రకాలను మరమగ్గాలు జెట్‌లూమ్స్‌పై తయారు చేస్తూ చేనేత కార్మికుల పొట్ట కొడుతున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ధర్మవరంలోని ఎన్జీఓ సమావేశ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చేనేతకు కేటాయించిన 11 రకాలు మరమగ్గాలపై తయారు చేస్తుండటంతో చేనేత మగ్గాలను నమ్ముకుని జీవనం చేసే కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరమగ్గాలను కట్టడి చేయాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రిజర్వేషన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత స్పందించి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు రమణ, చట్టారవి, రవికుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీ అమలుకు డిమాండ్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఉచితంగా ఇసుకను పంపిణీ చేయాలని శుక్రవారం సీపీఎం నాయకులు కదిరి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా. గత ప్రభుత్వం పాలనలాగానే ఇసుకను కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆ పార్టీ నాయకులు సుబ్బిరెడ్డి, నరసింహులు పేర్కొన్నారు. ఇసుక ఉచితంగా ఇవ్వనందున ఇళ్ల నిర్మాణం ఆపేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలకు మూహూర్తాలు నిర్ణయించడంతోనే సరిపెట్టేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, బాబ్జాన్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తచెరువు : ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరుతూ శుక్రవారం కొత్తచెరువు రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్, బ్యాల్ల అంజి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నియోజకవర్గానికి ఒక ఇసుక రీచ్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు ఇసుక ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు నీలకంఠారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, శంకర్‌రెడ్డి, శ్రావణి, నాగమణి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తచెరువు తహసీల్దారుకు వినతి పత్రం

అధికారుల బాధ్యతల స్వీకరణ

అమడగూరు : అమృత మండల సమాఖ్యలో శుక్రవారం నూతన ఏపీఎంగా భారతి బాధ్యతలు స్వీకరించారు. చితమత్తూరులో విధులు నిర్వహిస్తున్న భారతి బదిలీపై అమడగూరుకు వచ్చారు. అమడగూరు ఏపీఎం గోపాల్ నల్లమాడకు బదిలీ అయ్యారు.

ఓబుళదేవరచెరువు : ఓబుళదేవరచెరువు ఎంపీడీఓగా రాబర్ట్ విల్సన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రొద్దం మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కొత్తచెరువు : కొత్తచెరువు మేజరు పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పనిచేసిన కార్యదర్శి అవినీతి ఆరోపణలతో దీర్ఘకాల సెలవుపై వెళ్లడంతో 7 నెలలుగా పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా సురేంద్రనాథరెడ్డి బాధ్యతలు నిర్వర్తించారు. అనంతపురం జిల్లా కల్లూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

ఎస్పీని కలిసిన ఎస్ఐ

పుట్టపర్తి పట్టణం : పుట్టపర్తి రూరల్ ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లింగన్న శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంచాలని ఎస్పీ సూచించారు. **పుట్టపర్తి గ్రామీణం :** పుట్టపర్తి మండల ఎస్ఐగా లింగన్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కృష్ణమూర్తి బుక్కపట్నానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో నల్లచెరువు ఎస్ఐ లింగన్నను బదిలీపై నియమించారు.



ఎస్పీకి మొక్క అందజేస్తున్న ఎస్ఐ

నల్లమాడ ఎస్ఐగా దాదాఖలందర్

నల్లమాడ : నల్లమాడ ఎస్ఐగా దాదాఖలందర్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రమేశ్‌బాబు సోమందేపల్లికి బదిలీపై వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో ఆయన్ను నియమించారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

కదిరి ఎక్సైజ్ సీఐగా వీరారెడ్డి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వీరారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేసి, నిల్వలపై ఆరా తీశారు. రాష్ట్రంలో మద్యం దుకాణాల విషయంలో కొత్త విధానాన్ని అమలు చేస్తున్నందున ఆ ప్రక్రియకు సంబంధించిన కార్యాచరణపై దృష్టిపెట్టినట్లు సీఐ తెలిపారు. కదిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మొత్తం 12 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల తనిఖీల్లో ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి కుప్పకూలిన ఇల్లు

తాడిమర్రి, : మండలంలోని ఏకపాదంపల్లిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వృద్ధురాలు సాకే అంకమ్మ ఇల్లు కుప్పకూలింది. ఈ సమయంలో వృద్ధురాలు బయటకు రావడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఇల్లు కూలిపోవడంతో నిత్యావసర సరుకులన్నీ పాడైనట్లు వృద్ధురాలు విలపించారు. అధికారులు స్పందించి ఆర్థిక సహాయం అందజేయాలని, ఇంటిని మంజూరు చేయాలని బాధితురాలు కోరుతోంది.

నూతన కార్యవర్గం ఎన్నిక

తాడిమర్రి : తాడిమర్రిలో శుక్రవారం సీపీఎం ప్రధాన కార్యదర్శి మధు ఆధ్వర్యంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణతోపాటు 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, ఏఐటీయూసీ నాయకులు రమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ గలగల.. చెరువులకు జలకళ

☛ 25 రోజుల్లోనే నిండిన వైనం ☛ పచ్చగా మారిన బీడు భూములు

ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి, రాప్తాడు, న్యూస్‌టుడే: దశాబ్ద కాలం క్రితం వరకూ రాప్తాడు నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిస్తేనే చెరువులు నిండే పరిస్థితి. అడపా దడపా కురిసే వర్షాలకు చెరువుల్లో అంతంత మాత్రమే నీరు నిల్వ ఉండేది. చెరువు నీటిపైనే ఆధారపడి వేల ఎకరాల ఆయకట్టు సాగు ఆధారపడి ఉంది. చెరువులు నిండకపోవడంతో ఆయకట్టు ఏళ్లకేళ్లు బీడులుగా మారి ముళ్లకంపలతో అడవులను తలపించేవి.


◆ రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న మొత్తం చెరువులు : 52
◆ అందులో నీరు చేరినవి : 44
◆ ఆయా మండలాల పరిధిలోని చెరువుల ఆయకట్టు : 7260 ఎకరాలు

2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో హంద్రీనీవా కాలువను పూర్తి చేసి కృష్ణా జలాలను మాల్యాల లిఫ్ట్ నుంచి తీసుకుచ్చారు. అక్కడి నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరి, అక్కడి నుంచి ప్రధాన కాలువ నుంచి ఉపకాల్వల ద్వారా ఉమ్మడి జిల్లాలోని చెరువులకు నీరందించారు. వైకాపా పాలన సాగిన ఐదేళ్లూ ఏ చెరువుకూ నీరందనే లేదు. కూటమి ప్రభుత్వం రాకతో ప్రస్తుతం చెరువులకు నీరు చేరుతోంది. వర్షపాతం లోటు కొనసాగుతున్న క్రమంలో కృష్ణాజలాల రాక రైతుల్లో ఆనందం నింపుతోంది.



నిండుకుండలా ఆత్మకూరు మండలం మదిగుబ్బ చెరువు

సాగుకు అనుకూలం



కృష్ణా జలాలు గ్రామ సమీపంలో కామరాజు కుంటకు ఏటా చేరుతున్నాయి. చుట్టూ ఉన్న 3 గ్రామాల రైతులకు మేలు చేకూరుతోంది. భూగర్భ జలాలు తగ్గి వ్యవసాయ బోర్లు ఎండిపోయేవి. ఆ సమస్య లేకుండా వ్యవసాయ బోర్లలో నీరు అందుతున్నాయి. పంటల సాగుకు ఇబ్బంది లేదు.

-రవి, రైతు, చందమూరు, చెన్నేకొత్తపల్లి

విద్యార్థినుల అరుణాచల గిరిప్రదక్షిణ

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరం మానస నృత్యకళా కేంద్రం విద్యార్థినులు నృత్యం, కోలాటం చేస్తూ గురువారం తమిళనాడులోని అరుణాచలం గిరిప్రదక్షిణ చేశారు. గిరిప్రదక్షిణ చేసిన మానస నృత్యకళాకేంద్రం శిక్షకురాలు మానస, విద్యార్థినులకు ఆదియోగి అవార్డులు అందుకున్నారు.

ఇసుక దందా అరికట్టండి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : కొంతమంది అక్రమార్కులు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని, అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదని సీపీఎం నాయకులు ఆర్డీఓ మహేశ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఇసుక తరలించే ట్రాక్టర్ బాడుగను తగ్గించేలా ఉన్నతాధికారులతో చర్చించాలని కోరారు. పూర్తిగా ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్మవరంలో కార్మిక శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దన్న, బాషా, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల అపహరణ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంలో ఉంచిన రూ.1.50 లక్షలు అపహరణకు గురైనట్లు కదిరి పట్టణం వై.ఎస్.ఆర్. కాలనీకి చెందిన ఆంజనేయులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు. ఆంజనేయులు స్టేట్ బ్యాంక్‌లో రూ.1.50 లక్షలు డ్రా చేసుకుని ప్లాస్టిక్ కవర్‌లో పెట్టుకుని ఆ సొమ్మును తన ద్విచక్ర వాహనం ముందు సంచిలో ఉంచారు. ఇంటికి సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం స్టాండ్‌కు సంబంధించిన స్ప్రింగ్ ఊడిపోయింది. గుర్తించిన అతను వాహనాన్ని ఆపి కొత్తగా కడుతున్న ఇంట్లో ఉన్న కార్పెంటర్ వద్ద స్క్రూడ్రైవర్ కోసం వెళ్లాడు. అతన్ని అనుసరిస్తున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనానికి ఆనుకుని ఫోన్ మాట్లాడుతున్నట్లు నటిస్తూ సంచిలోని నగదుతో ఉడాయించాడు. స్క్రూడ్రైవర్‌తో పాటు వచ్చిన ఆంజనేయులు డబ్బు ఉన్న ప్లాస్టిక్ కనిపించకపోవడంతో అపహరణకు గురైనట్లు తెలుసుకుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.



ధర్మవరం సాలెవీధిలో ధనలక్ష్మిగా పెద్దమ్మ



ధర్మవరం : మహాలక్ష్మీదేవిగా దుర్గమ్మ



పుట్టపర్తి గ్రామీణం : గాయత్రిదేవిగా దుర్గాదేవి



చెన్నేకొత్తపల్లి: న్యామద్దలలో గాయత్రిగా మహేశ్వరి



అమడగూరు : అలంకరణలో శ్రీచౌడేశ్వరిదేవి

శక్తి స్వరూపిణీ శిరసా నమామి

పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పట్టు వస్త్రాలు, వివిధ ఆభరణాలతో అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. జగన్మాతకు అశేష భక్తజనం నీరాజనాలు పలికారు.

– న్యూస్‌టుడే బృందం



కదిరి పట్టణం : మీనాక్షిదేవిగా మరకత మహాలక్ష్మి



కదిరి : కూర్మావతార అలంకారంలో శ్రీఖాద్రీశుడు

ఆర్టీసీ బస్సు - కారు ఢీ

కదిరి పట్టణం, నల్లమాడ : కదిరి - హిందూపురం ప్రధాన రహదారిపై నల్లమాడ మండలం పులగంపల్లి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు - కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు వివరాలు. కదిరికి చెందిన సమీర్‌ఖాన్ కుటుంబంతో కలిసి బెంగళూరు నుంచి కదిరికి వస్తున్న సమయంలో కదిరి నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పరస్పరం ఢీకొన్నాయి. సమీర్‌ఖాన్ కారులో ఇరుక్కుపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రమాద స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో బాధితుడిని వాహనం నుంచి బయటకు తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సమీర్‌ఖాన్ మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద స్థలాన్ని కదిరి అప్‌గ్రేడ్ సీఐ మోహన్ పరిశీలించారు.



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

ధర్మవరం, న్యూస్‌టుడే : బత్తలపల్లి మండలం పత్యాపురంలో శుక్రవారం రాత్రి భూవివాదంలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవలో ఇరు వర్గాలకు చెందిన ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నకేశవరెడ్డి, శేషారెడ్డి కుటుంబాలు గ్రామ సమీపంలో పొలం కొనుగోలు చేశారు. పొలానికి సంబంధించిన హద్దుల విషయంలో కొంతకాలంగా రెండు కుటుంబాలకు గొడవలున్నాయి. ఈ దశలో శేషారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం రాత్రి పొలం పనులు చేసేందుకు ట్రాక్టర్‌లో వెళ్లారు. సమస్య పరిష్కారం కాకనే పొలంలోకి వెళ్లారని చెన్నకేశవరెడ్డి అతని కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. దీంతో మాటామాటా పెరిగి ఇరువర్గాలు గొడవపడి పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో చెన్నకేశవరెడ్డి, అతని భార్య ఆదినారాయణమ్మ, కుమారులు రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి గాయపడ్డారు. మరో వర్గానికి చెందిన శేషారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి గాయపడ్డారు. గాయపడిన ఇరువర్గాల వారు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి వద్ద రెండు వర్గాలకు చెందిన వారు ఘర్షణ పడుతుండటంతో ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బత్తలపల్లి పోలీసులకు ఇరు వర్గాలకు చెందిన వారు పరస్పరం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.



గాయపడిన రాజశేఖర్‌రెడ్డి, శేషారెడ్డి